క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు జిల్లా కోర్టు జరిమానా విధించింది. ఈసంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 17 మందిని పట్టుకున్నట్టు చెప్పారు. శుక్రవారం వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 12 మందికి ఒక్కొక్కరికీ రూ. 2 వేల చొప్పున, నలుగురికి రూ. 4 వేలు జరిమానా విధించారు. మరో వ్యక్తికి రూ. 5 వేలు జరిమానా విధించినట్టు తెలిపారు.

నూతన నియామకం



నియామకపత్రం అందుకుంటున్న నథానీయల్

జహీరాబాద్ టౌన్: యూత్ కాంగ్రెస్ ఆర్టీఐ లీగల్ సెల్ జిల్లా చైర్మన్‌గా న్యాయవాది నాథనీయల్ నియమితులయ్యారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. జిల్లాలో యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఈసందర్భంగా శివసేనారెడ్డి, మాజీ మంత్రి గీతారెడ్డి, జహీరాబాద్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'భూ సమస్యలను పరిష్కరించాలి'

కొండాపూర్(సంగారెడ్డి): ధరణిలో భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు మునిదేవునిపల్లిలో అసైన్డ్ భూముల రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కొండాపూర్, జహీరాబాద్, కోహీర్ మండలాలకు చెందిన అసైన్డ్ రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య, జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాంధీ చిత్ర ప్రదర్శన

సంగారెడ్డి టౌన్: మహాత్మా గాంధీ చలనచిత్రం ఉచిత ప్రదర్శనలో భాగంగా మూడో రోజు జిల్లాలో 6,400 మంది విద్యార్థులు చలన చిత్రాన్ని వీక్షించినట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ శుక్రవారం తెలిపారు. శుక్రవారం జిల్లాలోని 12 సినిమా థియేటర్లలో సినిమాను ప్రదర్శించినట్లు చెప్పారు.

మెరుగైన సేవలందించండి

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

పటాన్‌చెరు టౌన్: సంక్షేమ పథకాలు అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ నేత, పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ విమర్శించారు. శుక్రవారం అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. డబుల్ బెడ్రూం, నిరుద్యోగ భృతి అందించాలన్నారు. దళిత బంధు, మూడెకరాల భూమి హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకులు రవీందర్, ఎడ్ల రమేష్, బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహావిష్కరణ



విగ్రహాల ఆవిష్కరణలో డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, తదితరులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని గొల్లపల్లిలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే, సర్వాయి పాపన్నగౌడ్, చాకలి ఐల్లమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహనీయుల విగ్రహాలను పెట్టడమే కాకుండా వారి జీవిత చరిత్రపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రుక్మోద్దీన్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, రజక, గౌడ సంఘం అధ్యక్షులు నాగేష్ పాల్గొన్నారు.



సంగారెడ్డి పట్టణంలో..



సదాశివపేట పట్టణంలో..



నారాయణఖేడ్‌లో..

సర్వాయి పాపన్న జీవితం ఆదర్శం



చిట్కుల్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు

బడుగుల జీవితాల్లో చైతన్యం రగిలించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం నేటి యువతకు ఆదర్శమని వివిధ పార్టీల నాయకులు కొనియాడారు. శుక్రవారం పాపన్న జయంతిని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఐబీ వద్ద గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అలాగే జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పాల్గొన్నారు. బహుజన రాజ్యం కోసం పరితపించిన పోరాట యోధుడని కొనియాడారు. చిట్కుల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు పాల్గొన్నారు.



హత్నూర మండలం దేవులపల్లిలో..



జిన్నారంలో..



సంగారెడ్డిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న గౌడ సంఘం నాయకులు



జహీరాబాద్ టౌన్: పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శివకుమార్, నాయకులు



పటాన్‌చెరుటౌన్: పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో నాయకులు

నీలం మధుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

- జిల్లా మత్స్యశాఖ పాలకవర్గం తీర్మానం

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టణంలో జిల్లా మత్స్యకార సంఘం డైరెక్టర్లు శుక్రవారం సమావేశం నిర్వహించారు. పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ నీలం మధుకు కేటాయించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. టికెట్ కేటాయిస్తే రాష్ట్రంలోని 60 లక్షల ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని కాపాడినవారు అవుతారని పేర్కొన్నారు. నీలం మధుకు టికెట్ ఇవ్వకపోతే బీఆర్ఎస్ పార్టీకి దూరం అవుతామని హెచ్చరించారు.

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్ బీఆర్ఎస్ నుంచి నీలం మధుకు కేటాయించాలని మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ మహేశ్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మండలంలోని ఊట్లలో మత్స్యశాఖ పాలకవర్గం తీర్మానం చేశారు.

బీఎల్‌ఓలతో సమావేశం

జిన్నారం(పటాన్‌చెరు): ఎన్నికలు సమీపిస్తుండడంతో ఓటరు నమోదు, తదితర విషయాలపై శుక్రవారం అదనపు కలెక్టర్ రాధాబాయి గుమ్మడిదల మండల బీఎల్‌ఓలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆధార్ అనుసంధానం, ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటరు నమోదు, తదితర విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవాని, ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ముల్తాని

ఝరాసంగం(జహీరాబాద్): కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని మాచ్నూర్ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు ఎండీ. ముల్తాని నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.

నెలపాటు ప్రవచనాలు



బసవేశ్వరుని పూజలో శివకుమార్

జహీరాబాద్ టౌన్: ప్రవచనాలు మానవాళి మనుగడకు ఉపయోగపడుతాయని కర్నాటకలోని మైసూర్ బసవ ధ్యాన మందిర పీఠానికి చెందిన ప్రముఖ వచనకారులు బసవలింగమూర్తి అన్నారు. జహీరాబాద్ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో బసవేశ్వర ఫంక్షన్‌హాల్‌లో శరణతత్వ ప్రవచాలను ప్రారంభించి మాట్లాడారు. లింగాయత్ సమాజం అధ్యక్షుడు రాజశేఖర్ షెట్కార్, ప్రధాన కార్యదర్శి సుభాష్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలతో పాటు ఇతర పార్టీల నాయకులు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు మురళీపంతులు, ఎంపీటీసీ దామోదర్, సర్పంచ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని ఎడ్లరేగడి తండా పంచాయతీ కేంద్రంలో ఎస్టీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం జ్వాలాముఖి కాళుబాబా ఆలయాన్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గంగారాం, నాయకులు వెంకట్‌రెడ్డి, రాజుపటేల్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు 5కే రన్

జహీరాబాద్ టౌన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలో 5కే రన్ నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంలోని ఎంఆర్‌హెచ్ఎస్ పాఠశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని.. యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

◆ సీసీ రోడ్డు పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కనుకుంటలో సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ పుష్ప నగేష్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాల్లో నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ తెలిపారు. హిస్టరీ– 1 తెలుగు, ఇంగ్లిష్ మీడియం పోస్టు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. పీజీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం, ఇతరులకు 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. పీహెచ్‌డీ, నెట్‌సెట్ బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 21న సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ మద్యం మత్తులో వీరంగం



సంగారెడ్డి అర్బన్: పట్టణంలో శుక్రవారం బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్ ఎదుట మద్యం మత్తులో నాగరాజు అనే వ్యక్తి ఆగి ఉన్న కారుపై ట్రాక్టర్ ఎక్కించాడు. వెంటనే స్థానికులు అతడిని చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

◆ విద్యార్థులకు గ్లాసుల పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యాభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెపల్లి లలిత సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాగిజావ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు శ్రీపాల్‌రెడ్డి 900 మంది విద్యార్థులకు స్టీల్ గ్లాసులు, స్టవ్, సిలిండర్‌ను అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లచ్చిరాం నాయక్, హెచ్ఎం రమాదేవి, తెల్లాపూర్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, నాయకులు సాగర్ పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న ఏఎన్ఎంల సమ్మె

కొండాపూర్(సంగారెడ్డి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాల్గవ రోజుకు చేరుకుంది. మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థినులకు నగదు ప్రోత్సాహం

ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతులలో టాపర్‌గా నిలిచిన విద్యార్థినులకు శుక్రవారం కెనరా బ్యాంకు అధికారులు నగదు ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రవీందర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

◆ కార్మికుల ధర్నా

జహీరాబాద్ టౌన్: కనీస వేతనం, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, రూ. 21 వేల కనీస వేతనం, వారాంతపు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే శనివారం నుంచి రిలే దీక్షలు చేపడుతామని హెచ్చరించారు.

గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి కృషి



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం మక్తక్యాసారం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు క్యాంపు కార్యాలయంలో రెండో విడత గొర్రెలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం గొల్ల, కురుమల అభివృద్ధికి కృషి చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌తో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): మండలంలోని గొర్రెగట్టుకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మూడోసారి అధికారం మాదే..

వట్‌పల్లి(అందోల్): అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బిజిలీపూర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం జోగిపేట పట్టణంలో విశ్వబ్రహ్మణ స్వర్ణకార సంఘ నూతన భవనాన్ని ప్రారంభించారు. అలాగే ఎంఎస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, సర్పంచ్ లింగాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం



నారాయణఖేడ్: బీజేపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

నారాయణఖేడ్: ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ నారాయణఖేడ్ రాజీవ్‌చౌక్‌లో శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించారని.. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోగా నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, నాయకులు నగిరేశం, సుధాకర్, పట్నం మాణిక్, సంజీవ్‌పాటిల్ పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే న్యాయం చేస్తాం

కొండాపూర్(సంగారెడ్డి): పరిపాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని సంగారెడ్డి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తే పేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోచారం రాములు, నాగరాజు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



బీటీ రోడ్డు రెన్యువల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: లింకు రోడ్ల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇంద్రేశం చౌరస్తా నుంచి బచ్చుగూడెం, చిట్కుల్ మీదుగా ఇస్నాపూర్ జాతీయ రహదారి వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా నిర్మిస్తున్న బీటీ రోడ్డు రెన్యువల్ పనులను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఇస్నాపూర్ చౌరస్తా నుంచి వయా నందిగామ, క్యాసారం వరకు నిర్మించిన రోడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో తొమ్మిదేళ్లలో 20కి పైగా బ్రిడ్జిలు నిర్మించడంతో పాటు గ్రామాల మధ్య అంతర్గత రహదారులను నిర్మించామని తెలిపారు. ఎంపీపీ సుష్మా శ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, పంచాయతీరాజ్ శాఖ ఈఈ జగదీశ్వర్, ఎంపీడీఓ బన్సీలాల్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, నందిగామ సర్పంచ్ ఉమావతి గోపాల్, ఎంపీటీసీలు నాగజ్యోతి లక్ష్మణ్, మాధవి నరేందర్ రెడ్డి, చిట్కుల్ ఉపసర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, డీఈ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శం

- హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్



సంగారెడ్డి: లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, సదాశివపేట(సంగారెడ్డి): సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ఆదర్శంగా ఉందని రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో సంగారెడ్డి, కంది మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ. 4 వేల పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని చెప్పారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో సంగారెడ్డి అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, సీడీసీ చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభుగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సదాశివపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి మైనార్టీ నేతలు



మైనార్టీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

జహీరాబాద్ టౌన్: ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో జహీరాబాద్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. టీఎస్ఐడీసీ చైర్మన్ ఎండీ తన్వీర్ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లు మోయిజ్, ఫక్రొద్దీన్, అక్బర్‌తో పాటు 200 మంది మైనార్టీ యువకులకు హైదరాబాద్‌లోని తన నివాసంలో గులాబీ కండువా కప్పి మంత్రి హరీశ్‌రావు పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో..

మొగుడంపల్లి మండలం గోపన్‌పల్లికి చెందిన వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మోహినొద్దీన్, సర్పంచ్ సీతారాంరెడ్డి, ఉప సర్పంచ్ అంజన్న, నాయకులు సత్యనారాయణరెడ్డి, మాణిక్‌రెడ్డి, లక్ష్మణ్, విల్సన్ పాల్గొన్నారు.